



# కరపత్రం

SINCE 2014

బుధవారం మార్చి 19 2025 | సంపుటి :0 | సంచిక : 156 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4


## బెట్టింగ్ ఇన్‌ఫ్లూయెన్సర్లపై విచారణ చేసి
# చర్యలు తీసుకుంటాం



హైదరాబాద్ మార్చి 18

తెలుగు రాష్ట్రాల్లో సెలబ్రిటీలు, యూట్యూబ్ ఇన్‌ఫ్యూయెన్సర్లపై బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేయడంతో హైదరాబాద్ పంజాగుట్ట పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. విష్ణుప్రియ, సుప్రీత, ఇమ్రాన్ ఖాన్ (పరేషన్ బాయ్స్), హర్ష సాయి, రీతూ చౌదరి, టేస్టీ తేజతో సహా మొత్తం 11 మందిపై క్రిమినల్ కేసులు పెట్టారు. పేజి 2లో

## హైకోర్టును తప్పుదోవ పట్టించిన
## పిటిషనర్‌కు కోటి జరిమానా



మిగతా 2లో



## ప్రధాని మోడీతో ఇళయారాజా భేటీ

ప్రధాని నరేంద్ర మోదీని ప్రముఖ సంగీత దర్శకుడు,రాజ్యసభ సభ్యుడు ఇళయరాజా మర్యాదపూర్వకంగా కలిశారు. సంబంధిత ఫొటోలను మ్యూజిక్ డైరెక్టర్ సోషల్ మీడియా వేదికగా షేర్ చేశారు. మోదీజీతో ఎప్పటికీ మర్చిపోలేని సమావేశమిది. నా 'సింఫొనీ- వాలియంట్' సహా పలు అంశాలపై చర్చించాం. ఆయన ప్రశంసలు, మద్దతుకు కృతజ్ఞుడినని పేర్కొన్నారు. లండన్‌లో ఇటీవల ఇళయరాజా 'వాలియంట్' పేరిట మ్యూజికల్ ఈవెంట్ నిర్వహించిన సంగతి తెలిసిందే. లండన్‌లో వెస్టర్న్ క్లాసికల్ సింఫొనీ నిర్వహించిన తొలి ఆసియా మ్యూజిక్ కంపోజర్‌గా ఇళయరాజా రికార్డు సృష్టించారు.

# ఎస్సీ వర్గీకరణ బిల్లుకు
# తెలంగాణ శాసనసభ ఆమోదం

- తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో ఎస్సీ వర్గీకరణ బిల్లును శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించింది.
- షమీమ్ అక్తర్ కమిషన్ ప్రజల నుంచి 8,681 ప్రతిపాదనలు స్వీకరించి, 59 ఎస్సీ ఉపకులాలను 3 గ్రూపులుగా విభజిస్తూ సిఫార్సులు చేసింది.
- కాంగ్రెస్ పార్టీ దశాబ్దాలుగా ఎస్సీల హక్కుల కోసం పోరాడుతూ, దామోదరం సంజీవయ్యను తొలి ఎస్సీ సీఎం చేసిందని సీఎం రేవంత్ గుర్తు చేశారు.
- సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన గంటలోపే ప్రభుత్వం అనుకూల నిర్ణయం తీసుకొని, మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేసింది.



హైదరాబాద్: ఎస్సీ వర్గీకరణ బిల్లుకు తెలంగాణ శాసనసభ ఆమోదం తెలిపింది. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి దళితులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. పార్టీలో, ప్రభుత్వంలో ఎస్సీలకు కాంగ్రెస్ పార్టీ ఎన్నో అవకాశాలు ఇచ్చిందన్నారు. ఎస్సీ వర్గీకరణ బిల్లుపై చర్చ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు.

"బాబూ జగ్జీవన్‌రామ్‌కు కేంద్రంలో వివిధ శాఖల బాధ్యతలు అప్పగించి గౌరవించింది. దేశంలోనే తొలిసారిగా ఎస్సీ వ్యక్తి దామోదరం సంజీవయ్యను సీఎంగా చేసింది కాంగ్రెస్ పార్టీ. ఉమ్మడి రాష్ట్రంలోనూ ఎస్సీ వర్గీకరణ కోసం పోరాటం జరిగింది. దశాబ్దాలుగా సాగిన పోరాటంలో ఎంతో మంది ప్రాణాలు అర్పించారు. 2004లో ఉషా మెహ్రా కమిటీ వేసి సమస్య పరిష్కరించడానికి కాంగ్రెస్ ప్రయత్నించింది. ఇన్నాళ్లకు నేను సీఎంగా ఉండగానే సమస్య పరిష్కారం కావటం సంతోషకరం.సుప్రీంకోర్టు తీర్పు వచ్చిన గంటలోపే ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా నిర్ణయం ప్రకటించాం. వెంటనే ఉత్తమ్ నేతృత్వంలో మంత్రివర్గ ఉపసంఘం నియమించాం. మంత్రివర్గ ఉపసంఘం సూచన మేరకు షమీమ్ అక్తర్ కమిషన్ నియమించాం. కమిషన్.. ప్రజల నుంచి 8,681 ప్రతిపాదనలు స్వీకరించింది. కమిషన్ నివేదికను ఏ మాత్రం మార్చకుండా ఆమోదించాం. 59 ఎస్సీ ఉప కులాలను 3 గ్రూపులుగా కమిషన్ విభజించింది. 59 కులాలు ఇప్పటివరకు పొందిన ప్రయోజనాల ఆధారంగా కమిషన్ సిఫార్సులు చేసింది" అని సీఎం వివరించారు. ఎస్సీ వర్గీకరణ బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించిన సభ్యులకు సీఎం కృతజ్ఞతలు తెలిపారు.

# విసునీత విజయాల
# పట్ల భారత్ గర్విస్తోంది

- నీవు క్షేమంగా తిరిగి రావాలని కోరుకుంటున్నాం
- భారత్‌లో పర్యటించాలని ఆకాంక్షిస్తున్నాం
- సునీతా విలియమ్స్‌కు మోడీ లేఖ

2లో

## బీసీ రిజర్వేషన్ల బిల్లుపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత కీలక వ్యాఖ్యలు

- బీసీ రిజర్వేషన్ల బిల్లుపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కీలక వ్యాఖ్యలు చేశారు. బీసీల విషయంలో కాంగ్రెస్ పార్టీ ద్వంద్వ వైఖరిని ఎమ్మెల్సీ కవిత ఎండగట్టారు. కాంగ్రెస్ పార్టీ వల్లనే బీసీలకు ఈ దేశంలో అన్యాయం జరిగిందని ఆమె మండిపడ్డారు.



2లో

## యాదగిరిగుట్ట ఆలయానికి ధర్మకర్తల మండలి: మంత్రి కొండా సురేఖ



2లో

### ప్రశ్నోత్తరాలపై సమాధానం చెప్పలేక కాంగ్రెస్
# ప్రభుత్వం పారిపోతుంది



హైదరాబాద్ : శాసనసభలో ప్రశ్నోత్తరాలపై సమాధానం చెప్పలేక కాంగ్రెస్ ప్రభుత్వం పారిపోతుందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ధ్వజమెత్తారు. అందుకే ఈరోజు కీలకమైన ప్రశ్నోత్తరాలు ఉన్నాయని సమాధానం చెప్పలేక రద్దు చేసుకుంది. దీని పైన స్పీకర్‌కు, కార్యదర్శికి అభ్యంతరం చెప్పామని హరీశ్‌రావు తెలిపారు. అసెంబ్లీ లాబీలో మీడియాతో హరీశ్‌రావు చిట్ చాట్ చేశారు.

ఈ ప్రభుత్వం హెచ్ఎండీఏ భూములు తాకట్టు పెట్టి 20 వేల కోట్లు అప్పు తెస్తున్నారు. టీజీఐఐసీ 10 వేల కోట్లు, హెచ్ఎండీఏ ఆస్తులు కుదబెట్టి 20 వేల కోట్లు, హెచ్ఎండబ్ల్యూఎస్ 10 వేల కోట్లు, జీహెచ్ఎంసీ ఆస్తులను తాకట్టు పెట్టి 10 వేల కోట్లు అప్పులు తెచ్చేందుకు సిద్ధమైంది. మొత్తం 50 వేల కోట్లను అప్పు చేస్తుంది. పేజి 2లో

## హైడ్రా పేరుతో
# వసూళ్ల దందా..

### మూసీ పేరుతో పేదల ఇండ్లపై పగ : కేటీఆర్

హైదరాబాద్ : రేవంత్ రెడ్డి సర్కార్‌పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిప్పులు చెరిగారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలను గాలికి వదిలేసి.. కమీషన్లు ఎక్కడ వస్తాయో అక్కడ దృష్టి పెట్టిందని కేటీఆర్ ధ్వజమెత్తారు. పేజి 2లో



# నియోజక వర్గాల పునర్విభజన పట్ల

# తలాతోకా లేని తమిళ తంబి వాదన

శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్

- హిందీ వ్యతిరేకతతో ఊపిరి పోసుకున్న ద్రవిడ వాదం
- ఆ ఊపిరి నిలుపుకోవడానికి మళ్ళీ హిందీ వ్యతిరేక ప్రచారం ప్రారంభించింది
- హిందీ వ్యతిరేకతకు తమిళుల మద్దతు కరువయ్యిందని నియోజక వర్గ పునర్విభజన అంశాన్ని డీఎంకే తలకెత్తుకున్నది
- అసలు బాధ లిక్కర్ కుంభకోణం కప్పి పుచ్చుకోవడానికి




భారత స్వాతంత్రం పూర్వం నుండి తమిళనాట బ్రిటిషర్ల ప్రభావం,పట్టు అధికం.భారత స్వాతంత్ర కాంక్షను నిర్వీర్యం చెయ్యడానికి ఆంగ్లేయులు చేయని కుట్ర లేదు.అందులో భాగంగా ఆంగ్లేయులు ఆర్య ద్రావిడ సిద్ధాంతాన్ని సృష్టించారు.ఆంగ్లేయులకు తమిళనాట ఇవి రామస్వామి పెరియార్ దొరికాడు. దేశ విభజన సమయంలో తమిళనాడును ప్రత్యేక దేశంగా చెయ్యాలని పెరియార్ చాలా ప్రయత్నం చేసాడు. దాని కొరకు ముహమ్మద్ అలీ జిన్నా సహకారం అర్థించాడు. బ్రిటిషర్లు చెప్పినట్టు ఆడినవాడు పెరియార్. మన భారత దేశం స్వాతంత్రం సాధించిన తర్వాత1966 సం.వరకు తమిళనాట కాంగ్రెస్ పాలన సాగింది. స్వాతంత్ర పోరాట స్ఫూర్తి సద్దు మనిగిందని గ్రహించిన బ్రిటిష్ తొత్తులు అవకాశం కొరకు ఎదురు చూస్తున్న సమయం వారికి లాభించింది.

### హిందీ వ్యతిరేక ఉద్యమం

హిందీ భాష ఉత్తరాది వారిది. అది ఆర్యుల భాష. పరాయి భాష అంటూ తమిళ భాషాభిమానాన్ని రెచ్చగొట్టడం ప్రారంభించారు.తమిళ భాషాభిమానం తప్పు కాదు. ఇంకొక భారతీయ భాషను వ్యతిరేకించడం అభిలషణీయం కాదు.

### హిందీ పరాయి భాష అయితే ఇంగ్లీష్ స్వంత భాష ఎలా అవుతుంది

కాంగ్రెస్ అప్రతిహత పాలనతో రాజకీయ అధికారం తమకు దక్కడం లేదని పెరియార్ తో పాటు అన్నా దురై మొదలగు ఒక తరం నాయకులు భాష పేరుతో ప్రాంతీయ అభిమానాన్ని రెచ్చగొట్టి రాజకీయ అధికారం సాధించాలని ద్రవిడ వాదాన్ని భుజాలకెత్తుకున్నారు.

### ద్రవిడ వాదం ఫక్తు రాజకీయ వాదం

భారతదేశంలోనే తమిళ నాట ఉన్నన్ని అద్భుత హిందూ ఆలయాలు దేశంలో ఎక్కడా లేవు. మొఘలాయిల నుండి విదేశీ దాడులనుండి హైందవాన్ని రక్షించిన శంకరాచార్యులు,మధ్వాచార్యులు,రామానుజాచార్యులు దక్షిణ భారత దేశంలో జన్మించిన మహానుభావులు.
ఉత్తర భారత దేశం నిరంతర దాడులతో సతమతమవుతుంటే, దక్షిణ భారతం ధర్మ రక్షణ భాధ్యత తీసుకున్నది. అలెగ్జాండర్ కాలంలో దేశాన్ని ఏకత్రితం చేసిన చాణక్యుని జన్మ స్థలం కూడా దక్షిణ భారత దేశం.

### రాజకీయ వాదం .. ధార్మిక వాదం ఒక్కటి కాదు

ఈ ద్రావిడ వాదం రాజకీయ రూపం తీసుకున్నప్పటికీ హిందూ ఆచార వ్యవహారాలు తమిళ నాట ప్రభలంగా ఉన్నాయి.ఆంగ్లేయుల,కమ్యూనిస్టుల,క్రైస్తవుల ప్రభావం వల్ల ద్రవిడ వాదం హిందూ వ్యతిరేక వాదంగా రూపుదిద్దుకున్నది.కరుణానిధి కొడుకు స్టాలిన్ అయ్యాడు. స్టాలిన్ కొడుకు ఉదయనిధి ఏకంగా క్రైస్తవుడయ్యాడు.ద్రవిడ వాదంలో స్వార్థ శక్తులు పుట్టగొడుగుల్లా వెలిశాయి. లెక్కలేనన్ని ద్రవిడ పార్టీలు స్థాపించబడ్డాయి. లేటెస్ట్ గా టివికే పార్టీ మొదలయ్యింది. ఈ పార్టీ స్థాపించింది క్రైస్తవుడైన సినిమా నటుడు విజయ్.ఈ అన్ని పార్టీలు తమిళులను రెచ్చగొట్టి పబ్బం గడుపుకోవడానికి చెయ్యని ప్రయత్నాలు లేవు.డిఎంకె నుండి విడిపోయిన అన్నాడిఎంకె గుడ్డిలో మెల్ల. డిఎంకె లాగా కాకుండా కొద్దిగా హిందూ సాఫ్ట్ కార్నర్ ప్రదర్శించిన చరిత్ర దీనిది.

### ఈ ద్రావిడ వాదం ఇప్పుడు లిక్కర్ వాదంగా మారింది

తమిళనాట విడతల వారీగా అధికారం పంచుకుంటున్న డిఎంకె, అన్నా డిఎంకె పార్టీలు రెండూ మద్యం తయారుచేసే ఫ్యాక్టరీల ప్రతినిధులుగా ఉన్నారు. ఈ రెండు పార్టీల్లో ఎవరు అధికారంలో ఉంటే వాళ్ళ డిస్టిలరీల నుండి 75 శాతం మద్యం సరఫరా జరుగుతుంది.డిఎంకె పార్టీ ఈ టర్మ్ పాలనలో ఒక వెయ్యి కోట్ల రూపాయల కుంభకోణానికి పాల్పడిందని బయట పడింది. ఈడీ రంగ ప్రవేశం చేసింది. దాని వెంట ఐటి శాఖ ఉండనే ఉంటుంది.ఈ హఠాత్పరిమాణంతో డిఎంకె హడలిపోతున్నది.ఢిల్లీ కేజ్రీవాల్ మాదిరి తమిళనాడులో తమ పరిస్థితి మారుతుందని బెంబేలెత్తుతున్నది.ఈ విచారణలో తమ భవిష్యత్తు అగమ్యగోచరం అవుతుందని ఇప్పుడు డిఎంకె స్టాలిన్ డిలిమిటేషన్ రాగం అందుకున్నాడు.డిలిమిటేషన్ వల్ల దక్షిణ భారతానికి ఎంపీ సీట్లు తగ్గుతాయని మళ్ళీ పాత పాట అందుకున్నాడు.

### డిలిమిటేషన్ వల్ల ఎంపీ సీట్లు తగ్గుతాయా

కేంద్రం తమిళనాడుపై హిందీ రుద్దుతున్నదని స్టాలిన్ విమర్శ చెయ్యగానే,తమిళనాడు బిజెపి నాయకుడు అన్నామలై కౌంటర్ ఎటాక్ చెయ్యడంతో స్టాలిన్ వ్యూహం మార్చి డిలిమిటేషన్ తో దక్షిణ భారత దేశానికి పార్లమెంటులో సీట్లు తగ్గుతాయని ప్రచారం మొదలుపెట్టి లిక్కర్ కుంభ కోణం అంశాన్ని ప్రజల దృష్టికి రాకుండా ప్రయత్నం ప్రారంభించాడు. నియోజక వర్గాల పునర్విభజన వ్యతిరేక సమావేశం అంటూ, కేంద్ర ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టి తమ లిక్కర్ కుంభ కోణం అంశాన్ని పక్కకు తప్పించాలని ప్రయత్నిస్తున్నాడు.

### డిలిమిటేషన్ తో ఎవరికి నష్టం

దక్షిణ భారత దేశంలో జనాభా తక్కువ అని,ఉత్తర భారత దేశంలో ఎక్కువ అని, కాబట్టి ఉత్తర భారత దేశానికి డిలిమిటేషన్ తో ఎక్కువ ఎంపీ సీట్లు దక్కుతాయని,దానివల్ల దక్షిణ భారత దేశానికి పార్లమెంట్ లో ప్రాధాన్యం తగ్గుతుందని స్టాలిన్ విక్టిమ్ గేమ్ మొదలు పెట్టాడు.

### దక్షిణ భారతానికి నిజంగా సీట్లు తగ్గుతాయా

ఉత్తర ప్రదేశ్ జనాభా 25 కోట్ల 75 లక్షలు. దేశ జనాభాలో 17 శాతం. స్టాలిన్ వాదన ప్రకారం మొత్తం 543 పార్లమెంట్ స్థానాల్లో 17 శాతం జనాభా నిష్పత్తి ప్రకారం యూపికి 93 ఎంపీ సీట్లు ఉండాలి. కానీ యూపిలో ప్రస్తుతం 80 ఎంపీ సీట్లు మాత్రమే ఉన్నాయి.
బీహార్ జనాభా దాదాపు 13 కోట్లు. జనాభా నిష్పత్తి ప్రకారం బీహార్ కు 46 ఎంపీ సీట్లు ఉండాలి. కానీ బీహార్ కు ప్రస్తుతం 40 సీట్లు మాత్రమే ఉన్నాయి.కేవలం యూపి,బీహార్ రెండు రాష్ట్రాల జనాభా మొత్తం 38.5 కోట్లు. అంటే దేశ మొత్తం జనాభాలో ఈ రెండు రాష్ట్రాల జనాభా నిష్పత్తి 25.5 శాతం.

నియోజక వర్గాల విభజన, జనాభా ప్రకారం నిర్ణయించబడుతుంది.
ఇది మోడీ,బిజెపి చేసింది కాదు. కాంగ్రెస్ కాలం నుండి నెహ్రూ ఇందిరా కాలం నుండి అనుసరిస్తున్న విధానం.

### దక్షిణ భారత జనాభా ఎంత

కేరళ,తమిళనాడు,కర్నాటక,ఆంధ్ర ప్రదేశ్,తెలంగాణ కలిపి ఐదు దక్షిణ రాష్ట్రాల జనాభా మొత్తం 27 కోట్లు. పుదుచ్చేరి జనాభా 17 లక్షలు కలుపుకుంటే మొత్తం 27 కోట్ల పైచిలుకు.
ఉత్తర భారతం లోని కేవలం రెండు రాష్ట్రాలు యూపీ బీహార్ లో కంటే మొత్తం దక్షిణ రాష్ట్రాల జనాభా దాదాపు 12 కోట్లు తక్కువ.ఈ రెండు రాష్ట్రాలకు కలిపి 120 సీట్లు ఉంటే, ఈ రెండు రాష్ట్రాల కంటే తక్కువ జనాభా ఉన్న ఐదు దక్షిణ రాష్ట్రాలకు 129 సీట్లున్నాయి. పుదుచ్చేరిని కలుపుకుంటే 130 సీట్లు.

### ముస్లిం జనాభా ఎంత

స్టాలిన్ ఒకసారి మత నిష్పత్తి ప్రకారం ఆలోచిస్తే యూపి,బీహార్ లోని మొత్తం ముస్లిం జనాభా 6 కోట్లకు చేరుకున్నది. అంటే ఈ రెండు రాష్ట్రాల ముస్లిం జనాభా ఒక తమిళనాడు జనాభాతో సమానం.ఎంత సేపూ ద్రావిడ,ఆర్య అంటూ ఊకదంపుడు వాదనల బదులు,జనాభా పెరుగుదలతో మత కోణం గురించి ద్రవిడ వాదులు ఆలోచించాలి.

### కుటుంబ పాలనకు అలవాటు పడ్డ పార్టీల వాదన చెల్లదు

తమిళనాడులో డిఎంకె సెంట్రిక్ కమ్యూనిస్టు పార్టీ, క్రైస్తవం పుచ్చుకున్న నాయకుల పార్టీ,ఒకే కుటుంబం ఆధీనంలో ఉన్న పార్టీ.ఈ దేశంలో రాచరిక పాలన లేదు.కుటుంబ పాలన సాగకూడదు. కుటుంబ పాలనతో రాచరిక ధోరణి మొదలవుతుంది.

### ద్రవిడ వాదం కాలం చెల్లింది

ఈ ద్రవిడ వాదం ఆంగ్లేయుల సృష్టి. ఆంగ్లేయులు అంటే క్రైస్తవులు. ఈ క్రైస్తవ యూదుమూలానికి చెందిన కార్ల్ మార్క్స్ ప్రతిపాదించిన కమ్యూనిజం కాంబినేషన్ ఈ ద్రవిడ వాదం.ఈ ద్రావిడ వాదాన్ని తలపైన మోసేది ఈ క్రైస్తవ,కమ్యూనిస్టు,సూడో అంబేద్కరిస్టులు.క్రైస్తవ మతం పుచ్చుకుని తాము ఇంకా దళితులమని, తాము అంబేద్కర్ వారసులమని ఊదరగొట్టే వారు మాత్రమే. ఆర్య దండయాత్ర, ద్రావిడ అణచివేత అనే కిచిడీ వాదాన్ని ఇన్నాళ్లు ప్రచారం చేస్తూ వచ్చారు.వీరి వెనకాల జీహాదీ శక్తులు చిరతలు వాయిస్తూ తిరుగుతుంటారు.

### ఇకపై ఈ అరాచక వాదాలు చెల్లవు

ఈ ఉత్తర దక్షిణ భారత విభజన వాదాలు పనిచేయవు. కాల చక్రం తిరిగింది. వెయ్యేళ్ళ అణచివేత నుండి భారతీయత మళ్ళీ లేచింది.తమిళ నాట స్టాలిన్ హిందీ వ్యతిరేక ప్రచారం. డిలిమిటేషన్ వ్యతిరేకతతో ఇక పప్పులు ఉడకవు. ఈ సెంట్రిక్ కమ్యూనిస్టు, క్రిప్టో క్రైస్తవ, సూడో అంబేద్కరిస్టుల, కుహనా ప్రజా సంఘాల, అర్బన్ నక్సలైట్ల, సామ్రాజ్య వాద దేశాల మానస పుత్రుల, జీహాదీ శక్తుల ఆటలు సాగవు. ఈ దేశం, ఈ దేశ ప్రజలు వీరి ఆటలు సాగనివ్వరు. వీరందరినీ ఏకకాలంలో ఎదుర్కొనే శక్తి యుక్తులు ఈ దేశానికి ఉంది.డిలిమిటేషన్ లో సవరణలు మార్పు చేర్పులు చేయాల్సిన భాధ్యత అన్ని పార్టీలది.శాస్త్రీయ విధానంలో నియోజక వర్గాల పునర్విభజన చేయాల్సిన భాధ్యత వదిలేసి ప్రాంతీయ వాదాన్ని, ఉత్తర దక్షిణ భారత వాదాన్ని ఉసిగొల్పడం నేరం. భాధ్యతా రాహిత్యం.

ద్రవిడ వాదం కేవలం రాజకీయ వాదం. ఈ వాదం పుట్టిన తమిళనాడులోనే త్వరలో సమాధి అవుతుందని విజ్ఞుల అభిప్రాయం.

## బోధన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 8 మందికి ఒక రోజు జైలు శిక్ష

సాయికృష్ణ కట్కం, కరపత్రం ప్రతినిధి

బోధన్ పట్టణంలో మద్యం తాగి వాహనం నడిపిన బోధన్ పట్టణంలోని శక్కర్ నగర్ కు చెందిన యాసీన్ కు సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ శేష తల్ప సాయి ముందు హాజరుపరచగా ఒక రోజు జైలు శిక్ష విధించినట్లు పట్టణ సీఐ వెంకటనారాయణ పేర్కొన్నారు. పట్టణంలోని ఆజాం గంజ్ లోని పక్క పక్క ఇల్లు గల కుటుంబ సభ్యులు గొడవ పడి పబ్లిక్ న్యూసెన్స్ చేస్తున్న ఇరు కుటుంబ సభ్యులు నలుగురు మహిళలు, ముగ్గురు పురుషులను మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా వారికి కూడా ఒకరోజు జైలు శిక్ష విధించినట్లు ఆయన తెలిపారు.

## 20 న జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు

సాయికృష్ణ కట్కం, కరపత్రం ప్రతినిధి

జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 20న స్థానిక రాజారాం స్టేడియంలో అండర్ 14 16 18 20 బాలబాలికలకు 100 ,400 జావ్లిన్ త్రో ఈవెంట్స్ లో జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు నరాల రత్నాకర్,రాజా గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు.పోటీలో పాల్గొనే క్రీడాకారులు ఉదయం 10 గంటలకు క్రీడా ప్రాంగణానికి చేరుకోవాలని కోరారు.క్రీడల్లో పాల్గొనడానికి ప్రతి విద్యార్థి రిజిస్ట్రేషన్ రుసుము 100 రూపాయలు చెల్లించి పాల్గొన్నారు.ఒకరోజు ముందు రిజిస్ట్రేషన్ చేయించుకున్న క్రీడాకారులకు మాత్రమే పార్టిసిపేషన్ సర్టిఫికెట్ ఇవ్వనున్నట్లు వారికి తెలిపారు. ఇతర వివరాలకు రాజా గౌడ్ం91 99890 40776 కు సంప్రదించాలని కోరారు.

## 15 మంది డీఎస్పీలకు పదోన్నతులు

సాయికృష్ణ కట్కం, కరపత్రం ప్రతినిధి

రాష్ట్రంలోని 15 మంది డీఎస్పీలకు పదోన్నతులు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి రవిగుప్త ఉత్తర్వులు జారీ చేశారు.రాష్టంలోని వివిధ జిల్లాల్లో ఏసీపీ,డీఎస్పీలకు అదనపు ఎస్పీలుగా పదోన్నతులు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.అందులో ప్రధానంగా హైదరాబాద్, సైబరాబాద్,రాచకొండ, నల్గొండ, నిజామాబాద్ కమిషనరేట్ లో పనిచేస్తున్న డీఎస్పీలకు ఏఏస్పీలుగా ప్రమోషన్లు ఇచ్చారు. నిజామాబాద్ స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ శ్రీనివాస్ రావుకు పదోన్నతి కల్పించి డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఇపపటి వరకు కొత్తగా పదోన్నతి పొందిన అదనపు ఎస్పీలకు ఎవరికీ పోస్టింగ్ లు ఇవ్వలేదు.

## "పిఎం శ్రీ" బాలికల పాఠశాల వార్షికోత్సవం

ఆకుల రంజిత్, కరపత్రం ప్రతినిధి

**పాఠశాలలో విద్యార్థులకు వార్షికోత్సవ సంబరాలు**
"పిఎం శ్రీ" జిల్లా పరిషత్ బాలికల పాఠశాల కల్లూరు రోడ్, కోరుట్లలో వార్షికోత్సవ వేడుకల సంబరాలు ఘనంగా జరిగాయి.పోటీ ప్రపంచంలో విద్యార్థులను ఆకర్షించడానికి పాఠశాల బృందం చేస్తున్న కృషిని అమ్మ ఆదర్శ పాఠశాల చైర్ పర్సన్ అంజమ్మ ప్రశంసించారు. జిల్లా విద్యాధికారి కె.రాము పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమాల చిత్రమాలిక ఆవిష్కరించారు మరియు పదవ తరగతి విద్యార్థులతో ఛాయా చిత్రం దిగి, 100 శాతం ఫలితాలు సాధించాలని శుభాకాంక్షలు తెలిపారు. మున్సిపల్ కమీషనర్ రామకృష్ణ, మండల విద్యాధికారి గంగుల నరేషం, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు చేస్తున్న కృషిని అభినందించారు. విద్యా సంవత్సరంలో ప్రతీ దినం




నూతనంగా నిర్వహించడం, ప్రతీ పోటీని ఛాలెంజ్ గా తీసుకోవడం క్రమశిక్షణతో విద్యార్థులు మెలగడం వల్ల ఉపాధ్యాయు సిబ్బంది కృషి మూలంగా వార్షికోత్సవం విజయవంతంగా చేసుకో గలిగామని పాఠశాల ప్రధానోపాధ్యాయులు CH కృష్ణ మోహన్ రావ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు, తల్లి తండ్రులు, విలేకరులు స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




## తెలంగాణ ప్రభుత్వానికి కృతజ్ఞతలు

ఆకుల రంజిత్, కరపత్రం ప్రతినిధి

ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పేట భాస్కర్




గత ముప్పై సంవత్సరాల ఎస్సీ వర్గీకరణ పోరాటాలకు ఫలితంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో 2025 ఎస్సీ వర్గీకరణ బిల్లును ఆమోదించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి, బిల్లుకు సహకరించిన ప్రతిపక్ష పార్టీలకు తెలంగాణ ప్రజాసంఘాల జేఏసీ, అంబేద్కర్ యువజన సంఘాల రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పేట భాస్కర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.మంగళవారం కోరుట్లలోని టిపిఎస్ జేఏసీ కార్యాలయంలో పేట భాస్కర్ మాట్లాడుతూ జస్టిస్ షమీమ్ అక్తర్ ఏకసభ్య కమిషన్ నివేదికను ఆమోదించిన ప్రభుత్వం ఎస్సీ 59 కులాలను మూడు గ్రూపులుగా వర్గీకరణ చేసి అసెంబ్లీలో బిల్లు తెవడం దానికి చట్టబద్ధత కల్పించడం రాష్ట్ర ప్రభుత్వ చిత్తశుద్ధి కి నిదర్శనమని అన్నారు. ఉద్యమకాలంలో మరణించిన మాదిగ అమరవీరుల కుటుంబ సభ్యులకు ఇందిరమ్మ ఇళ్ల లో, రాజీవ్ యువవికాస్ లో మొదటి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించడం అభినందనీయమని పేట భాస్కర్ తెలిపారు. ఇక రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో, ఉద్యోగాల నియామకాలతో పాటు అన్ని రంగాల్లో వర్గీకరణ అమలు జరుగుతుందన్నారు.వర్గీకరణ పోరాటంలో ఎమ్మార్పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ కృషి భవిష్యత్తు తరాలకు స్ఫూర్తి దాయకమని, ఎమ్మార్పిఎస్ మొదటి తరం ఉద్యమ నాయకులతో పాటు ప్రస్తుత నాయకులకు ఎస్సీ వర్గాలకు పేట భాస్కర్ శుభాకాంక్షలు తెలిపారు.

# బోధన్ లో ఈద్గాను పరిశీలించిన సబ్ కలెక్టర్...



**సాయికృష్ణ కట్కం, కరపత్రం ప్రతినిధి**



బోధన్ పట్టణంలోని నర్సీరోడ్ లో గల ఈద్గా ను మున్సిపల్ కమీషనర్ వెంకటనారాయణ తో కలిసి సబ్ కలెక్టర్ వికాస్ మహతో మంగళవారం పరిశీలించారు. రాబోయే రంజాన్ పండగ దృష్ట్యా ముస్లీమ్ మైనారిటీలు ప్రార్ధనలు చేసుకునేందుకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఈద్గా వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేసి వసతులు కల్పించాలని సబ్ కలెక్టర్ వికాస్ మున్సిపల్ సిబ్బందికి సూచించారు. అనంతరం శక్కర్ నగర్ చౌరస్తా వద్ద లీక్ అవుతున్న పైప్ లైన్ ను పరిశీలించి తగిన మరమ్మాత్తులు చేపట్టి తాగు నీరుకు ఇబ్బందికి తలెత్తకుండా చూడాలని పేర్కొన్నారు.

# బిజెపి రాష్ట్ర సంఘటన మంత్రి ని ఘనంగా సత్కరించిన కౌన్సిల్ సభ్యులు...



**సాయికృష్ణ కట్కం, కరపత్రం ప్రతినిధి**



బీజేపీ రాష్ట్ర సంఘటన మంత్రి చంద్రశేఖర్ ను బీజేపీ కౌన్సిల్ సభ్యులు కందగట్ల రాంచందర్ ఘనంగా సత్కరించారు. సంఘటన మంత్రి చంద్రశేఖర్ రెంజల్ మండలంలోని కందకుర్తిలో ఏర్పాటు చేస్తున్న స్మృతి వనం సందర్శించడానికి వెళుతున్న క్రమంలో మంగళవారం ఎడపల్లి మండల కేంద్రంలో బిజెపి జిల్లా కౌన్సిల్ సభ్యులు కందగట్ల రాంచందర్ నివాసానికి విచ్చేశారు. ఈ సందర్భంగా శ్రీ చంద్రశేఖర్ కు ఎడపల్లి మండల శాఖ, బోధన్ మండల శాఖ తరపున శాలువాతో ఘనంగా సన్మానం చేశారు. తెలంగాణలోనే ప్రప్రథమంగా ఎడపల్లి మండల కేంద్రంలో పూర్తి రాతి కట్టడంతో ఏర్పాటు చేసిన శ్రీ చత్రపతి శివాజీ మహారాజ్ చిత్ర పటాన్ని బహుకరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ కులాచారి, జిల్లా కార్యవర్గ సభ్యులు మల్లెపూల శ్రీనివాస్, మండల అధ్యక్షులు కోలా ఇంద్రకరణ్, బోధన్ మండల బీజేపీ నాయకులు సిర్ప సుదర్శన్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ యాదవ్, ఉపాధ్యక్షులు నాయిని లక్ష్మణ్ గౌడ్, శివ చైతన్య, బూత్ అధ్యక్షులు కంజరి ప్రదీప్ కుమార్, కట్కం అరుణ్ నాయకులు గంగాధర్, మల్లెపూల నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేసిన ఎమ్మెల్యే తోట



**సాయికృష్ణ కట్కం, కరపత్రం ప్రతినిధి**

రాష్ట్ర శాసనసభ లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదం పొందడంతో మంగళవారం జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు, ఎమ్మెల్యేలు వేముల వీరేశం, సామెల్, సత్యనారాయణ, కాలే యాదయ్యలతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు.

# మారుతి మందిరం హుండీ లెక్కింపు...



**సాయికృష్ణ కట్కం, కరపత్రం ప్రతినిధి**

బోధన్ పట్టణంలోని మారుతి మందిరం హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం ఆలయంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ పర్యవేక్షకురాలు కమల, ఈఓ రాములు ఆధ్వర్యంలో హుండీ తెరిచి లెక్కింపు చేపట్టారు. హుండీ లెక్కింపులో 30,660రూపాయల నగదు ఆదాయం సమకూరినట్లుగా ఆలయ కార్యనిర్వహణ అధికారి రాములు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గుండేటి శంకర్, ధర్మకర్తలు, అర్చకులు ప్రవీణ్ మహారాజ్, భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత, సైబర్ నేరాలు, మత్తు పదార్థాలు, షీ టీం పై అవగాహన సదస్సు నిర్వహించిన- సీఐ ప్రవీణ్ కుమార్:

**కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి**

పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం కుందనపల్లి గ్రామం ప్రధాన రహదారి వద్ద సీఐ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రజలకు, ప్రయాణికులకు రోడ్డు భద్రత ,సైబర్ నేరాలు, షీ టీం పై అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిఐ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.... ప్రతి ఒక్కరు కూడా రోడ్లపై వెళ్లేటప్పుడు హెల్మెట్ ధరించి ట్రాఫిక్ రూల్స్ ను పాటించాలని ,బైకులపై వెళ్లేటప్పుడు ,ఫోర్ వీలర్ పై వెళ్లేటప్పుడు కానీ అతివేగంగా వెళ్లకూడదని, రోడ్లు దాటేటప్పుడు చూసుకొని వెళ్లాలని ట్రాఫిక్ రూల్స్ ను పాటించకుండా రోడ్లు దాటేటప్పుడు అతివేగంగా వెళ్లడం వలన ప్రాణాలు కోల్పోవడం జరుగుతుందని, దీనిని ప్రయాణికులు ప్రతి ఒక్కరు గ్రహించాలని, సైబర్ నేరాల విషయంలో ఫోన్ల ద్వారా వచ్చే అనౌన్స్, ఫోనులను లిఫ్ట్ చేసినప్పుడు వారికి సంబంధించిన విషయం పై మాట్లాడినప్పుడే వారికి సమాధానం ఇవ్వాలని లేనిచో వారికి సమాధానం ఇవ్వకూడదని,



మీకు తెలియని నంబర్ నుండి ఫోన్స్ వచ్చిన మిమ్మల్ని ట్రాక్ చేయడానికి చూసిన సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నెంబర్ 1930 కు కాల్ చేసి కంప్లైంట్ రిజిస్టర్ చేసుకోవాలని,అనంతరం మహిళలకు షీ టీం పై అవగాహన సదస్సు నిర్వహిస్తూ మహిళలకు , విద్యార్థిని లకు కాలేజీలో, ఉద్యోగం నిర్వహించే దగ్గర ఆకతాయి లు ఈవ్ టీజింగ్, లేదా గృహహింస చేసినట్లయితే ,ఎప్పుడైనా ఎలాంటి ఆపద వచ్చినా తక్షణమే తమ షీ టీం ను సంప్రదించాలని, తమ షీ టీం లు తప్పకుండా మహిళల రక్షణ కోసం నిరంతరం





పహారా కస్తూ రక్షణ కల్పిస్తారని సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ ప్రవీణ్ కుమార్ ,అంతర్గాం సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ భోగె వెంకట్, పోలీస్ సిబ్బంది రాజేందర్, అభిషేక్ , నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సై చేతుల మీదుగా పదవ తరగతి విద్యార్థులకు పరీక్షా ప్యాడ్స్ అందజేత:

- భరోసా స్వచ్ఛంద సంస్థ సేవలు కడు ప్రశంసనీయం-ఎస్సై సంధ్యారాణి:
- విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఏర్పరచుకొని విజయం,గమ్యాన్ని చేరుకున్నప్పుడే ఉపాధ్యాయులకు సంతోషం-ప్రధానోపాధ్యాయరాలు శారద:
- పదవ తరగతి విద్యార్థులకు ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ తరపున బెస్ట్ విషెస్:
- త్వరలోనే జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో అభివృద్ధి పనులు ప్రారంభించబోతున్నారు- పల్లికొండ రాజేష్:

**కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి**

రామగుండం లోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జడ్.పి.హెచ్.ఎస్ లో భరోసా స్వచ్ఛంద సంస్థ నసీమ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు ఆల్ ద బెస్ట్ కార్యక్రమంలో భాగంగా ముఖ్యఅతిథిగా రామగుండం సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ సంధ్యారాణి చేతుల మీదుగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శారద, ఉపాధ్యాయులు శ్రీనివాస్ పలువురు ఉపాధ్యాయులు ప్రముఖ నాయకులు పల్లికొండ రాజేష్,గఫూర్,ప్రవీణ్, బుతుల్ పప్పీ, గున్నాల శ్రీనివాస్ సమక్షంలో పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ఫ్యాడ్స్ అందజేయడం జరిగినది. ఈ సందర్భంగా రామగుండం ఎస్ఐ మాట్లాడుతూ.... ఈనెల 21న జరగబోయే పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులంతా ఎలాంటి ఆందోళన పడకుండా ఎలాంటి బెరుకు లేకుండా భయపడకుండా పరీక్షను వ్రాయాలని, మీరు కలలు కంటున్నా స్వప్నాన్ని నెరవేర్చుకోవాలని , మంగళవారం భరోసా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో



ఎగ్జామ్ ప్యాడ్స్ అందజేయడం సంతోషంగా ఉందని వారిని ప్రత్యేకంగా అభినందిస్తున్నానని మాట్లాడడం జరిగినది. ప్రధానోపాధ్యాయురాలు శారద మాట్లాడుతూ.... ఉన్నత లక్ష్యాన్ని చేరుకోవడానికి ఆ దిశగా విద్యార్థులంతా ప్రయత్నం చేయాలని విద్యార్థులను పరీక్షలకు హాజరు అయ్యే ముందు తగిన విధంగా సన్నద్ధం చేస్తున్నామని, విద్యార్థులంతా ఎలాంటి ఆందోళన పడకుండా వారు కన్న కలలను సాకారం చేసుకోవాలని వారు అన్నారు.

పల్లికొండ రాజేష్ మాట్లాడుతూ.... చదువుకునే విద్యార్థుల మౌలిక వసతుల రూపకల్పన చేపట్టిన భరోసా స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయమని ,ఈనెల 21వ తేదీన మొదలయ్యే పదవ తరగతి పరీక్షలను దృష్టిలో ఉంచుకొని ఎగ్జామ్ ఫ్యాడ్స్ అందజేయడం ప్రశంసనీయమని , భరోసా నసీమ చేస్తున్న సేవలు వెలకట్టలేనివని, ప్రధానోపాధ్యాయురాలు శారద అభిప్రాయం మేరకు సింగరేణి వారి సౌజన్యంతో త్వరలోనే రామగుండం ఎమ్మెల్యే మక్కాన్సింగ్ రాజ్ ఠాకూర్ జడ్.పి.హెచ్.ఎస్ స్కూల్ రామగుండం కు సంబంధించిన పలు అభివృద్ధి



పనులను ప్రారంభించబోతున్నారని , రామగుండం నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి ఉన్నారని, పారిశ్రామిక ప్రాంత అభివృద్ధి కోసం అహర్నిశలు పాటుపడుతున్నారని, పదవ తరగతి విద్యార్థులకు ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ తరపున బెస్ట్ విషెస్ తెలియజేస్తున్నామని, తాను కూడా ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న విద్యార్తినేనని, ఉపాధ్యాయుల బోధనలతో భావి భారత పౌరులుగా రూపొందపడేది తరగతి గదిలోనేనని, విద్యార్థులంతా క్రమశిక్షణతో ఎలాంటి ఆందోళన పడకుండా అరగంట ముందుగానే ఎగ్జాం సెంటర్ కు చేరుకోవాలని, గమ్యాన్ని చేరుకునే క్రమంలో ఉన్నతమైన లక్ష్యాన్ని ముద్దాడాలని ,ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి వారు మాట్లాడారు .ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తో పాటు అధ్యాపక బృందం, పోలీస్ అధికారులు, సిబ్బంది,భరోసా స్వచ్ఛంద సంస్థ ఆర్గనైజర్ నసీమ, కాంగ్రెస్ పార్టీ నాయకులు గఫూర్,ప్రవీణ్, పప్పీ, బుతుల్ గున్నాల శ్రీనివాస్, కల్లెడ మల్లేష్, బింగి నరేష్ , తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ వర్గీకరణ బిల్లు దళితుల బతుకులకు చిల్లు!

- బీజేపీ అధికారం ఉన్నదగ్గర ఎందుకు వర్గీకరణ చేయడం లేదు
- రాజ్యాంగ విరుద్ధమైన ఎస్సీ వర్గీకరణ రాష్ట్ర ప్రభుత్వాలు ఎలా చేస్తారు అని ప్రశ్నిస్తున్న
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రాజ్యాంగం పైన గౌరవం లేదా?
- రాజ్యాంగం తెలవదా? పిల్లి సుధాకర్
- రాష్ట్ర అధ్యక్షులు జాతీయ మాల మహానాడు తెలంగాణ రాష్ట్ర నాయకులు

**కరపత్రం దినపత్రిక ప్రతినిధి. మార్చి 18**

నేడు తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో అసెంబ్లీ లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదం పొందడం చాలా దురదృష్టకరం రాజ్యాంగ విరుద్ధమైన ఈ అంశంపై ఏ ఒక్క యం.యల్.ఏ. కూడా, ఏపార్టీ కూడా వ్యతిరేకించకపోవడం మాలలపై ద్వేశాన్ని తెలుపుతుంది, మాలలని ఐక్యం చేసి ప్రభుత్వాల



తీరును ఎండగడతామన్నారు ,దీనిపై న్యాయపోరాటానికి జాతీయ మాలమహానాడు సిద్ధంగా ఉంది. అశాస్త్రీయమైన లెక్కలు తీసుకువచ్చి అసంబద్ధంగా దళితుల్ని విభజించడం ఏంటని ప్రశ్నించారు. ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు భారత రాజ్యాంగానికి వ్యతిరేకంగా ఎట్లా చేస్తారు? భారత రాజ్యాంగం పట్ల నాయకులకు అవగాహన లేదా ? భారత రాజ్యాంగం పట్ల ప్రజాప్రతినిధులకు గౌరవం లేదా? ఎస్సీ వర్గీకరణ మాలల పట్ల అశాస్త్రీయ లెక్కలు చూయించి మాలల్ని మోసం చేస్తున్నారన్నారు, ఈ వ్యవహారంపై న్యాయపోరాటం చేసి మాలల ఆత్మగౌరవాన్ని చాటుకుంటామన్నారు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీలను వర్గీకరణ పేరుతో శత్రువులను చేయొద్దు అన్నారు, అన్నదమ్ములు లాగా ఉన్న మాల మాదిగల పట్ల కుట్రపూరిత ఉద్దేశంతో విడగొడుతున్నారా అన్నారు.మనువాద ఎజెండా ను అమలు చేయడం చూస్తుంటే భవిష్యత్ లో దళితులకు రక్షణ లేదని అన్నారు. మాలలను అణిచివేయడానికి అన్ని పార్టీలు ఒకటయ్యాయి.

# విద్యార్థులు నిరంతరం కష్టపడి ఉన్నత స్థానానికి చేరాలి

**- ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ పి సదానందం**

**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని మార్చి 18:**

విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవడానికి నిరంతరం కష్టపడాలని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ పి.సదానందం అన్నారు. అంతర్గాం మండలం లింగాపూర్ ఆదర్శ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పి.సదానందం మాట్లాడుతూ విద్యార్థులు తమ జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకుని వారి తల్లితండ్రులకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. 10వ తరగతి విద్యార్థులు మాట్లాడుతూ వారి వారి స్వీయ అనుభవాలను, గత స్మృతులను స్మరించుకున్నారు. అనంతరం



విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో అందరిని అలరించారు. ముందుగా విద్యార్థులు తమ విజ్ఞానానికి మూలమైన ఆదర్శ పాఠశాలకు తమ గుర్తుగా జ్ఞాన సరస్వతి దేవి విగ్రహాన్ని బహుకరించారు. పాఠశాల పట్ల వారికి ఉన్నటివంటీ ప్రేమాభిమానాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ పి.సదానందం, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొని మార్చి 21 నుండి జరగబోయే 10వ తరగతి పరీక్షలకు విద్యార్థులు సంసిద్ధంగా దృఢ నిచ్చయంతో ఉండాలని, మంచి ఫలితాలు సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని కోరుకుంటూ విద్యార్థులకు శుభాశీస్సులను అందించారు.